క్లుప్తంగా

జిల్లా ప్రజా రవాణా అధికారిగా రాఘవ కుమార్

అమలాపురం రూరల్: అంబేడ్కర్ కోనసీమ జిల్లా ప్రజా రవాణా అధికారిగా ఎస్‌టీపీ రాఘవ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు జిల్లా డీపీటీఓగా అదనపు బాధ్యతలు నిర్వహించిన కాకినాడ డీపీటీవో ఎం.శ్రీనివాసరావు ఇక నుంచి కాకినాడకు పరిమితం కానున్నారు. ఏపీఎస్‌ఆర్టీసీ విజయవాడ హెడ్ ఆఫీస్‌లో సీసీ ఓఎస్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న రాఘవకుమార్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన గ్యారేజ్ ఆవరణలో మొక్కలు నాటారు. కష్టంతో కాకుండా ఇష్టంతో పని చేస్తే ఫలితాలు అద్భుతంగా ఉంటాయని ఆర్టీసీ ఉద్యోగులకు సూచించారు. తొలుత నూతన డీపీటీవోగా బాధ్యతలు స్వీకరించిన రాఘవకుమార్‌ను అమలాపురం డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ, రావులపాలెం, పలు డిపోల మేనేజర్లు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సత్యనారాయణ సేవలు ప్రశంసనీయం

తాళ్లరేవు: స్థానిక శ్రీమతి నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ హైస్కూల్ బయాలజీ ఉపాధ్యాయుడు గంగుల సత్యనారాయణ సేవలు ప్రసంశనీయమని పలువురు కొనియాడారు. స్థానిక హైస్కూల్ ప్రాంగణంలో స్కూల్ హెచ్‌ఎం జొన్నాడ ఆశాలత అధ్యక్షతన సత్యనారాయణ దంపతులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. స్కూల్ రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఎలిపె నాగేశ్వరరావు మాట్లాడుతూ సత్యనారాయణ మాస్టారు సేవలన కొనియాడారు. స్కూల్ స్టాఫ్ కోఆర్డినేటర్ వాకపల్లి అప్పారావు, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు పుల్లేటి కిషోర్, కోరంగి స్కూల్ హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం, యూటీఎఫ్ నాయకుడు ఎం.తాతారావు, ఎస్టీయూ నాయకుడు ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

19న వాహనాలకు వేలం

అమలాపురం టౌన్: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుకున్న రెండు వాహనాలకు ఈ నెల 19వ తేదీన వేలం నిర్వహిస్తున్నట్టు ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. మద్యం సీసాలు తరలిస్తూ పట్టబడిన రెండు కార్లకు నిర్వహించే వేలం కోసం రూ.2 వేలు ధరావత్తు చెల్లించి పాటదారులు పాల్గొనాలని ఆయన సూచించారు. అమలాపురం ఎక్సైజ్ స్టేషన్ ప్రాంగణంలో నిర్వహించే ఈ వేలంలో పాల్గొనే వారు ఇతర వివరాలకు 7569738693, 9676482024 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సీఐ సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు.

10న లోక్ అదాలత్

అమలాపురం టౌన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల లీగల్ సర్వీస్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టుల్లో వచ్చే నెల మే 10న లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్టు ఆ లీగల్ సర్వీస్ చైర్మన్, అమలాపురం రెండో అదనపు కోర్టు జిల్లా న్యాయమూర్తి వి.నరేష్ తెలిపారు. వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్, బ్యాంక్, చెక్ బౌన్స్, రాజీ పడ్డ క్రిమినల్ కేసులను ఈ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని ఆయన సూచించారు.

ఐక్య ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడిగా 'బొంతు'

యానాం: స్థానిక ఐక్య ఉపాధ్యాయసంఘం అధ్యక్షుడిగా దరియాలతిప్ప అల్లూరి సీతా రామరాజు ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం బొంతు సత్యశ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ఎంజీజీబీహెచ్ ప్రభుత్వ హైస్కూల్‌లో జరిగిన సమావేశంలో నూతన అధ్యక్షుని ఎన్నికున్నారు. గత అధ్యక్షుడిగా వ్యవహరించిన కె.పవన్ కుమార్ పదోన్నతి రావడంతో ఆయన పుదుచ్చేరి వద్ద నున్న కారైకల్ ప్రాంతానికి బదిలీ కావడంతో ఎన్నిక అనివార్యమైంది. మిగిలిన కార్యవర్గం యథావిధిగా ఉంటుందన్నారు.

అరాచకం సృష్టిస్తున్న వారిపై చర్యలు చేపట్టాలి

కాకినాడ సిటీ: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం జి.వేమవరం గ్రామంలో భయాన్ని, ఆరాచకాన్ని సృష్టిస్తున్న అనుకూలి నరసయ్య, అనుకూలి బాబూరావు (బాబ్జీ), అనుకూలి శ్రీనివాస్ అనే వ్యక్తులపై చర్యలు చేపట్టాలని కోరుతూ జి.వేమవరం గ్రామానికి చెందిన సూరంపూడి నూకరత్నం, అర్జునరావు దంపతులు బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్‌ను కలిసి విన్నవించుకున్నారు. అందించారు. నరసయ్య, బాబ్జీ, శ్రీనివాస్‌లు స్థలం విషయమైన తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారిపై కోరింగి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. వారం రోజుల క్రితం రాత్రి సమయంలో వారు కత్తులు, కర్రలతో దాడి చేసి మమ్ముల్ని చంపేస్తామంటూ బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ స్పందించి అధికారులు తక్షణం నరసయ్య, బాబ్జీ, శ్రీనివాస్ అనే వ్యక్తులపై కేసులు నమోదు చేసి జి.వేమవరం గ్రామంలో శాంతియుత వాతావరణంలో నెలకొల్పాలని కోరారు.

చనిపోయిన వారి ఓట్లను తొలగించాలి

అమలాపురం టౌన్: చనిపోయిన వారి ఓట్లు జాబితాల నుంచి పూర్తిగా తొలగించాలని వివిధ రాజకీయ పార్టీల నాయకులు అధికారులకు సూచించారు. అమలాపురం ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గంలోని మున్సిపల్ కమిషనర్, మూడు మండలాల తహసీల్దార్లు వచ్చే స్థానిక ఎన్నికల సందర్భంగా పలు రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాల్లో ఏమైనా ఇబ్బందులంటే తమ దృష్టికి తీసుకుని రావాలని అధికారులు ఆ నాయకులను కోరారు. వైఎస్సార్ సీపీ , టీడీపీ జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూముల లెక్క ఇక పక్కా

- భూ రీ సర్వేతో వివాదాలకు చెక్
- గ్రామాల్లో చురుగ్గా సాగుతున్న భూముల రీ సర్వే
- రైతులకు పక్కాగా పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ


రైతులతో చర్చిస్తున్న బృంద సభ్యులు

తాళ్లరేవు: భూముల లెక్క ఇక పక్కా కానుంది. భూముల రక్షణ, భూ వివాదాల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం పతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టు కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. దీనిలో భాగంగా గత ప్రభుత్వం జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకాన్ని తీసుకువచ్చింది. దీంతో ఎన్నో ఏళ్లుగా భూ వివాదాలతో సతమతమవుతున్న వారికి ఈ పథకం ఒక వరంలా మారింది. సుమారు వంద ఏళ్ల క్రితం బ్రిటీష్ వారి కాలంలో భూసర్వే జరిగింది. అయితే అప్పటి నుంచి రీసర్వే జరక్కపోవడంతో భూ వివాదాలతో అనేక మంది సతమతమయ్యారు. ఈ నేపథ్యంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకువచ్చి రీసర్వే చేపట్టడంతో ఈ పథకం ద్వారా రైతులకు మేలు జరుగుతోంది. గతంలో బ్రిటీష్ కాలం నాటి ఫీల్డ్ మెజర్‌మెంట్ బుక్ (ఎఫ్‌ఎంబీ)ల ఆధారంగా, భూముల సర్వే కష్టతరమవుతుండడం, రికార్డుల్లో సమగ్రత లేకపోవడం అనేక సమస్యలకు దారితీస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాటిలోని లోపాలను ఆసరాగా తీసుకుని కొందరు తప్పుడు రిజిస్ట్రేషన్లకు పాల్పడుతుండడంతో వివాదాలు నెలకొంటున్నాయి. ఆయా సమస్యలకు ఈ పథకం ఒక పరిష్కారంగా మారింది. ఇప్పటివరకు గ్రామీణ ప్రాంత రైతులు తమ భూములను సర్వే చేయించుకోవాలంటే ఎంతో సమయం వెచ్చించాల్సి రావడం, అనేక నిబంధనలు ఉండడంతో రైతులు ఎన్నో ఇబ్బందులు పడేవారు.

ఆధునిక టెక్నాలజీతో భూముల రీసర్వే

గత ఇబ్బందులను తొలగిస్తూ ప్రభుత్వం ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి డ్రోన్, రోవర్ పరికరాల ద్వారా కచ్చితత్వంతో సర్వే చేస్తోంది. అధునాతన డ్రోన్ ద్వారా సర్వే చేసి ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజెస్(ఓఆర్‌ఐ) మ్యాప్‌ను తయారు చేస్తారు. పంట పొలాలతో పాటు తోటలు, ఖాళీ స్థలాల సర్వే కూడా అత్యంత పారదర్శకంగా జరుగుతుంది. ఓఆర్‌ఐ మ్యాప్ ద్వారా క్షేత్రస్థాయిలో భూ సర్వేను నిర్వహించి తరువాత సరిహద్దులు నిర్ణయిస్తారు. గతంలో ఉన్న సర్వే నంబర్ల స్థానంలో ఎల్‌పీ నంబర్లను కేటాయిస్తున్నారు. రైతుల సమక్షంలోనే ఈ సర్వే జరుగుతుండడంతో సమస్యలను ఎక్కడికక్కడే పరిష్కారమవుతున్నాయి. రీసర్వే పూర్తయిన వెంటనే భూ యజమానులకు పక్కాగా పాస్‌పుస్తకాలను అందజేస్తున్నారు. దీంతో ప్రభుత్వ భూములు పరిరక్షించడంతోపాటు రైతుల మధ్య భూ వివాదాలకు తెరపడుతుంది.

తాళ్లరేవు మండలంలో ఇలా..

తాళ్లరేవు మండలంలో ఇప్పటివరకు ఫస్ట్ ఫేజ్‌లో భాగంగా ఇంజరం, ఉప్పంగల, జార్జీపేట, నీలపల్లి, సెకండ్ ఫేజ్‌లో చొల్లంగి, చొల్లంగిపేట, జి.వేమవరం, మూడో ఫేజ్‌లో భాగంగా పిల్లంక, సుంకరపాలెం పంచాయతీలలో రీసర్వే పూర్తయ్యింది. నాలగో ఫేజ్‌లో భాగంగా ఇటీవల పటవల పంచాయతీలో పూర్తిచేసారు. ప్రస్తుతం కోరంగి, పోలేకుర్రు గ్రామాలలో రీసర్వే ప్రక్రియను ప్రారంభించారు. ఈ ప్రక్రియకు సంబంధించి రైతులు తమ పాస్‌పోర్టు సైజు ఫొటోలు, దస్తావేజులు, ఆధార్‌కార్డు, పట్టాదార్ పాస్‌పుస్తకం, బ్యాంకు పుస్తకం తదితర జిరాక్స్ కాపీలను ముందుగానే అందజేయాలి. రైతు మరణించినట్టయితే మరణ ధృవీకరణ పత్రం, కుటుంబ సభ్యుల ధ్రువీకరణపత్రం, 1బీ ఫారం సమర్పించాల్సి ఉంది.

పారదర్శకంగా రీ సర్వే



ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టు కార్యక్రమం అత్యంత పారదర్శకంగా జరుగుతోంది. ఇప్పటికే రెవెన్యూ రికార్డులు ఆర్‌ఎస్‌ఆర్, వెబ్‌ల్యాండ్ అడంగల్, ఎఫ్‌ఎంబిలతో ఫీల్డ్ ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్(ఎఫ్‌పీఓఎల్‌ఆర్) పూర్తి చేశాం. దాని ద్వారా ఫారమ్–4లో రైతు డేటా సిద్ధం చేయడం, అలాగే మృతి చెందినవారి ఖాతాలు, జీరో ఎక్స్‌టెంట్ ఖాతాలు, అసైన్డ్‌ల్యాండ్‌లు, జిల్లా పరిషత్, ఆర్‌అండ్‌బీ, కేంద్రం, వక్ఫ్ తదితర ప్రభుత్వ భూములను గుర్తించి ఆన్‌లైన్‌లలో పెడుతున్నాం. 200 నుంచి 250 ఎకరాలను ఖండాలుగా ఏర్పాటు చేసి 12 బృందాలతో పాటు కమ్యూనికేషన్ బృందంతో ఎటువంటి సమస్యలు లేకుండా డాటా సిద్ధం చేశాం. రైతులకు ముందుగా సమాచారం ఇచ్చి వారి సమక్షంలోనే రీసర్వే చేస్తున్నాం.

– పితాని త్రినాథరావు, తహసీల్దార్, తాళ్లరేవు మండలం

భూ యజమానులు సహకరించాలి



ప్రభుత్వం నిర్వహిస్తున్న భూముల రీసర్వే కార్యక్రమం ద్వారా రైతులకు ఎంతో మేలు కలుగుతుంది. భూములకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులున్న తొలగిపోతాయి. ముఖ్యంగా సరిహద్దు వివాదాలు లేకుండా పక్కాగా అత్యంత పారదర్శకంగా ఈ కార్యక్రమం జరుగుతుంది. దీనికి భూ యజమానులందరూ ముందుగానే తమకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు అధికారులకు అందించి సహకరించాలి.

– కొత్తపల్లి వీరబాబు , డిప్యూటీ తహసీల్దార్ (రీసర్వే), తాళ్లరేవు మండలం

జగ్గిరెడ్డికి సత్కారం


జగ్గిరెడ్డిని సత్కరించి అభినందిస్తున్న ముస్లిం నాయకులు

అమలాపురం టౌన్: జిల్లా వైఎస్సార్ సీపీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన కొత్తపేట మాజీ ఎమ్మెల్సీ చిర్ల జగ్గిరెడ్డిని జిల్లాకు చెందిన పార్టీ ముస్లింలు నాయకులు బుధవారం ఘనంగా సత్కరించి అభినందించారు. జగ్గిరెడ్డి స్వగ్రామం రావులపాలెం మండలం గోపాలపురంలోని ఆయన స్వగృహంలో ఈ సత్కార అభినందన కార్యక్రమం జరిగింది. ముస్లిం సంప్రదాయం ప్రకారం జగ్గిరెడ్డిని సత్కరించడమే కాకుండా ఆయనకు ముస్లిం టోపీ (చౌకస్ టోపీ) ధరింపజేశారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకుని వచ్చిన వక్ఫ్ సవరణ చట్టం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. దీనిపై పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సుప్రీం కోర్టులో సవాల్ చేయడం సాహసోపేతమైన నిర్ణయమన్నారు. పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు, వక్ఫ్ బోర్డు జిల్లా మాజీ చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ మాట్లాడుతూ జిల్లాలోని మైనార్టీలు ఎప్పుడూ వైఎస్సార్ సీపీకి అండగా ఉంటారని చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా జగ్గిరెడ్డి కూడా ముస్లిం సామాజిక అభివృద్ధికి పాటు పడే నేతని గుర్తు చేశారు. ఖాదర్‌తోపాటు ముస్లిం నాయకులు ఎండీవై షరీఫ్, ఖ్వాజాబాబు, హారూన్, సందాని తదితరులు జగ్గిరెడ్డిని సత్కరించి అభినందించారు.

నైతిక విలువలతో కూడిన విద్యా బోధన అందించాలి

డీఈవో సలీమ్ బాషా


ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న హుస్సేన్‌ను సత్కరిస్తున్న డీఈవో బాషా తదితరులు

అమలాపురం టౌన్: ప్రతి పాఠశాలలో విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన వైద్య బోధన అందించాలని డీఈవో డాక్టర్ షేక్ సలీమ్ బాషా ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక 13వ వార్డు గొల్లగూడెంలోని మౌలానా అబుల్ కలాం అజాద్ మున్సిపల్ ఉర్దూ ప్రాథమిక పాఠశాల 107వ వార్షికోత్సవ కార్యక్రమానికి డీఈవో బాషా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంఎంకేజీ మొహినుద్దీన్ అధ్యక్షతన ఆ పాఠశాలలో బుధవారం జరిగిన ఈ వార్షికోత్సవ వేడుకల్లో డీఈవో మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ పాఠశాల మోడల్ ప్రాథమిక పాఠశాల అవుతోందని డీఈవో ప్రకటించారు. అయిదు తరగతులకు ఐదుగురు ఉపాధ్యాయులు ఉంటారని, ఈ లోగా పాఠశాలలో విద్యార్థుల హాజరు సంఖ్య గణనీయంగా పెంచాలని డీఈవో సూచించారు. పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎం.హుస్సేన్ రాష్ట్ర ఉర్దూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన సందర్భంగా ఆయనను డీఈవో బాషా ఘనంగా సత్కరించి అభినందించారు. ఇదే పాఠశాలలో పని చేస్తూ పదోన్నతితో బదిలీ అయిన కేఆర్ఎస్ ప్రసాద్‌ను డీఈవోతోపాటు ప్రధానోపాధ్యాయుడు మొహినుద్దీన్‌లు సత్కరించి అభినందించారు. చివరిగా డీఈవోను పాఠశాల తరుపున ఘనంగా సత్కరించారు. పాఠశాల ఉపాధ్యాయులతో పాటు పాఠశాల పేరెంట్ కమిటీ ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తొలి తెలుగు వెలుగు కందుకూరి


కందుకూరికి నివాళులు అర్పిస్తున్న పీటీఎం సంస్థ ప్రతినిధులు, పంచాయతీ అధికారులు

ఐ.పోలవరం: సంఘ సంస్కరణోద్యోమ తొలి తెలుగు వెలుగు కందుకూరి వీరేశలింగం అని పలువురు అభ్యుదయ వాదులు పేర్కొన్నారు. కందుకూరి వీరేశలింగం జయంతిని సందర్భంగా పీటీఎం సంస్థ బుధవారం నిర్వహించిన వేడుకలలో సాహితీ కార్యక్రమాలు నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పుల్లెపు వెంకటేశ్వరరావు సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ కందుకూరి గొప్ప సంస్కరణవాదిగా పేర్కొన్నారు. ఐ.పోలవరం పంచాయతీ కార్యదర్శి జీవీఎస్ఎన్ మూర్తి, వీఆర్వో కిరణ్, ఉంగరాల వెంకటేశ్వరరావు, ఎంఎస్ఎన్ మూర్తి, కేవీ సత్యనారాయణ, ఆర్.బాణేశ్వరరావు, ఏఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

రోగి మృతిపై బంధువుల ధర్నా


పొన్నాడ శ్రీనివాస్


ధర్నా చేస్తున్న మృతుని బంధువులు, గ్రామస్తులు

యానాం: రోగి మృతికి యానాం ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యమే కారణమంటూ బుధవారం మృతిని బంధువులు ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. వివరాలలోకి వెళితే నియోజకవర్గ పరిధిలో అయ్యన్ననగర్‌కు చెందిన పొన్నాడ శ్రీనివాస్(31) మంగళవారం రాత్రి కడుపునొప్పితో బాధపడుతుండడంతో అతనికి చికిత్స కోసం యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. ప్రాథమిక చికిత్సను అందించారు. తర్వాత శ్రీనివాస్ పరిస్థితి విషమంగా ఉండడంతో అతనిని అంబులెన్స్‌లో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అయితే అక్కడకు వచ్చే సరికే శ్రీనివాస్ మృతి చెందినట్టు కాకినాడ వైద్యులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో రోగి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో శ్రీనివాస్ మృతదేహానికి పోస్టుమార్టం చేసిన అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. అయితే శ్రీనివాస్‌ను యానాం జీజీహెచ్‌కు తీసుకువచ్చినప్పటికి వైద్యం చేయడం ఆలస్యం చేశారని, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే శ్రీనివాస్ మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. న్యాయం చేయాలని కోరుతూ జీజీహెచ్ ఎదుట గ్రామస్తుల ధర్నా చేశారు.ఈ ధర్నా ఉదయం నుంచి రాత్రి వరకూ కొనసాగింది. అనంతరం ఎస్‌ఆర్‌కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్ జీజీహెచ్ డీడీ రవిశంకర్‌తో చర్చించారు. ఘటనపై విచారణ చేయనున్నట్టు బాధ్యులపై చర్యలు తీసుకుంటున్నట్లు రవిశంకర్ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

వెటరన్ క్రీడా లోకానికి వీర్రాజు మృతి తీరని లోటు


సంతాపం తెలుపుతున్న ఎమ్మెల్సీ, వాకర్స్, క్రీడాకారులు

అమలాపురం టౌన్: వెటరన్ క్రీడాకారుడిగా రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని ఎన్నో పతకాలు సొంతం చేసుకున్న అమలాపురానికి చెందిన క్రీడాకారుడు బిళ్ల వీర్రాజు మృతి వెటరన్ క్రీడా లోకానికి తీరని లోటని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్య నారాయణరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల క్రీడా మైదానంలో సూర్య వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం జరిగిన వీర్రాజు సంతాప సభలో ఎమ్మెల్సీ సూర్యనారాయణ రావు మాట్లాడారు. 70 ఏళ్ల వయస్సులోనూ అటు వాకర్‌గా ఇటు వెటరన్ క్రీడాకారుడిగా వీర్రాజు 20 ఏళ్ల కుర్రాడిలా హుషారుగా ఉండేవారని గుర్తు చేశారు. వెటరన్ క్రీడాకారుడిగా వీర్రాజు సాధించిన పతకాలతో అటు రాష్ట్రానికి ఇటు దేశానికి ఎంతో కీర్తి ప్రతిష్ట తెచ్చారని వాకర్స్ క్లబ్ ప్రతినిధులు తమతో ఉన్న వాకింగ్ అనుబంధాన్ని గుర్తు చేసుకుని విచారం వ్యక్తం చేశారు. వీర్రాజు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వాకర్స్ క్లబ్ ప్రతినిధులు చప్పిడి శోభన్‌బాబు, షేక్ అబ్దుల్ ఖాదర్, కుడుపూడి త్రినాథ్, దొంగ హరిబాబు, అడపా రాము, ముంగర ప్రసాద్, క్రీడాకారులు సంతాపం తెలిపారు.

ఒకటి నుంచి బాస్కెట్‌బాల్ ఉచిత వేసవి శిక్షణ

అమలాపురం టౌన్: అమలాపురం జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల క్రీడా మైదానంలో ప్రతి సంవత్సరం వేసవిలో నెల రోజుల పాటు నిర్వహించే బాస్కెట్ బాల్ ఉచిత వేసవి శిక్షణా శిబిరం వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్టు శిబిరం నిర్వాహకులు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్, అమలాపురం కేజీకే గోఖలే, కేపీఆర్ మెమోరియల్ బాస్కెట్ బాల్ అసోసియేషన్ సంయుక్తంగా మే ఒకటో తేదీ నుంచి జూన్ ఒకటో తేదీ వరకూ ఈ ఉచిత శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు శిబిరం పర్యవేక్షకులు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు తెలిపారు. అండర్–10, 12, 14, 18 సంవత్సరాల బాలుర, బాలికలు ఈ శిక్షణా శిబిరంలో పాల్గొనేందుకు అర్హులని ఆయన వివరించారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ బాస్కెట్ బాల్ సీనియర్ కోచ్ ఆకుల ఉమామహేశ్వరరావు, నేషనల్ బాస్కెట్ బాల్ క్రీడాకారుడు ఎన్.అప్పలరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు కుడుపూడి సుబ్రహ్మణ్యం, యనమదల బుజ్జి, బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రతినిధి సంసాని గంగాధర్ శిక్షణనిస్తారని తెలిపారు. క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు. శిక్షణలో పాల్గొన్న బాల బాలికలకు జిల్లా స్థాయి మెరిట్ సర్టిఫికెట్లు అందజేస్తామని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు వివరించారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

అమలాపురం టౌన్: అగ్ని ప్రమాదాలపై ముఖ్యంగా అపార్టుమెంట్లలో జీవించే నివాసితులు మరీ అప్రమత్తంగా ఉండాలని అమలాపురం అగ్ని మాపక దళాధికారి కేవీ మురళీ కొండబాబు సూచించారు. అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక వడ్డీగూడెంలోని పలు అపార్ట్‌మెంట్లలో అగ్ని మాపక సిబ్బంది యంత్రాలు, పరికరాలు పని చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. అనివార్య కారాణాల వల్ల అగ్ని ప్రమాదం సంభవిస్తే తక్షణమే ఎలా స్పందించాలో, ఎలాంటి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలో మురళీ కొండబాబు వివరించారు. ముఖ్యంగా అపార్ట్‌మెంట్లలో ఉంటున్న గృహిణిలకు గ్యాస్ స్టౌవ్, సిలిండర్‌కు ప్రమాదం అనివార్యమైతే ఆ మంటలను ఎలా అదుపు చేయాల్లో ప్రయోగాత్మకంగా డెమో చూపించారు. లీడింగ్ ఫైర్‌మెన్ మట్టపర్తి బలరామ్, సిబ్బంది అగ్ని ప్రమాదాల నివారణ, రాకుండా ముందు జాగ్రత్త చర్యలను వివరించి అవగాహన కల్పించారు. ముందు జాగ్రత్త చర్యలతో ముద్రించిన కరపత్రాలను గృహిణులకు పంపిణీ చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

ఐ.పోలవరం: సీజనల్ వ్యాధులపై ముందు వైద్యులు అప్రమత్తంగా ఉండాలని, వాటిపై స్థానికులకు పూర్తి అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ నక్కా వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలో కేశనకుర్రు, జి.వేమవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సీజనల్ వ్యాధులైన ఎన్‌వీబీడీసీపీ వ్యాధి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ వ్యాధులపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. జ్వరం వచ్చిన ప్రతి రోగికి మలేరియా పరీక్షలు చేయాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే, ఫ్రైడే కార్యక్రమం చేపట్టాలని వెంకటేశ్వరరావు ఆదేశించారు. రెండు పీహెచ్‌సీలలోనూ రికార్డులను పరిశీలించి, ల్యాబ్ టెక్నీషియన్‌కు తగు సూచనలు చేశారు. దోమల నివారణపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జి.వేమవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఇందిరాశ్రీ, కేశనకుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర ఎంఎస్ రాజేష్ బాబు, సబ్ యూనిట్ ఆఫీసర్ పీఎస్‌వీ రాజకుమార్ తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలి


నంగవరంలో సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సంపదరావు

ఉప్పలగుప్తం: వైఎస్సార్ సీపీలో ప్రతీ ఒక్కరూ ఐక్యతతో మెలిగి, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు అన్నారు. నంగవరం గ్రామంలో జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరరావు నివాసంలో బుధవారం పార్టీ నాయకులంతా సమావేశమై విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనునిత్యం పార్టీకు అండదండలుగా ఉండే నాయకులను మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి వివిధ హోదాల్లో నియమించడంపై అభినందనలు తెలియజేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, ఉమ్మడి తూర్పు గోదావరి నుంచి పీఏసీ సభ్యుడిగా రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మాజీ మంత్రులు ముద్రగడ పద్మనాభం, పినిపే విశ్వరూప్ (పార్లమెంటు కోర్డినేటర్), అసెంబ్లీ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్‌లను నియమించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచులు కడిమి చిన్నవరాజు, పెయ్యిల రాజ్‌కుమార్, జొన్నాడ శ్రీదుర్గ, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు వంగా గిరిజాకుమారి, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు పోతుమూడి కొండబాబు, జేసీఎస్ కన్వీనర్ కోటుం లోవరాజు, మాజీ సర్పంచ్ శీలం సూరిబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు గుండుమోగుల వెంకటనారాయణ, పార్టీ నాయకులు మోటూరి సత్యంకాపు, కాట్రు కృష్ణ, రాయపురెడి నాగు, యాళ్ల చిన్నా పాల్గొన్నారు.

ఐఎన్‌టీఎస్‌వో పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థికి బహుమతులు అందజేస్తున్న డీవైఈవో

అమలాపురం టౌన్: ఐఎన్‌టీఎస్‌వో (ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్) – రెండో స్థాయి పరీక్షా ఫలితాల్లో స్థానిక శ్రీచైతన్య స్కూలు విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ పరీక్షల్లో స్కూలుకు చెందిన 383 మంది విద్యార్థులు ఫలితాలు సాధించారని డీవైఈవో గుబ్బల సూర్య ప్రకాశం తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఒక గ్రాండ్ ప్రైజ్, రెండు ప్రథమ బహుమతులు, రెండు ద్వితీయ, మూడు తృతీయ, నాలుగో స్థానంలో నలుగురు, దో స్థానంలో అయిదుగురు, పది ప్రత్యేక బహుమతులతో పాటు 103 కన్సొలేషన్ బహుమతులు, 255 బంగారు పతకాలు సాధించారు. విజేతలకు డీవైఈవో సూర్యప్రకాశం ఆ స్కూలులో బుధవారం జరిగిన అభినందన సభలో అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎంఏకే భీమారావు, స్కూలు ప్రిన్సిపాల్ వసు, రీజనల్ ఇన్‌చార్జి పిల్లా శ్రీనివాస్, డీన్ అరవ శ్రీను పాల్గొన్నారు.

కాలువ గట్లపై నీరు రావడంపై రైతుల ఆందోళన

అమలాపురం రూరల్: వరి కోతలు ప్రారంభమైన సమయంలో పంట కాలవల్లో సాగునీరు పరవళ్లు తొక్కుతూ పంట పొలాలను ముంచేస్తోంది. కాలువ గట్లపై నీరు రావడంపై రైతులు పడి పడుతున్నారు. ఇరిగేషన్ సిబ్బంది కాలువ నీటిమట్టం అధికంగా వదలడంతో ఈ పరిస్థితి నెలకొంది రైతులు చెబుతున్నారు. దీనివల్ల పంట పొలాల్లోనికి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నామని రైతులు చెప్పతున్నారు. ఖరీఫ్ వరి కోతలు కోయడానికి కోత మిషన్లు దిగడానికి వీలుగా లేదని చెబుతున్నారు. కాలువ నీటి మట్టం తగ్గించాలని వారు కోరారు. సవరప్పాలెం, వన్నె చింతలపూడి, కిత్తన చెరువు, గోపవరం సరిపెల్ల గ్రామాల రైతులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

గురుకులంలో ఫుడ్ కమిటీ సభ్యుల తనిఖీ


పాఠశాల ఆవరణలో పాడవేసిన కూరగాయలను పరిశీలిస్తున్న ఫుడ్ కమిటీ సభ్యుడు కిరణ్

ముమ్మిడివరం: ఠానేల్లంక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో వంట నిర్వహకులపై వచ్చిన ఆరోపణలపై ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట నిర్వాహకులు పురగుల పట్టిన వంకాయలు, పాడైన ఆనబ కాయ, బెండకాయలతో వంటలు చేయడాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు గుర్తించి అభ్యంతరం వ్యక్తం చేయడంతోపాటు ఈవిషయాన్ని ఫుడ్ కమిటీ సభ్యుడు కిరణ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఆయన గురుకుల పాఠశాలలో తనిఖీ చేశారు. పేరెంట్స్ కమిటీ సభ్యుల నుంచి పూర్తి వివరాలు సేకరించారు. వంట శాలను పర్యవేక్షించారు. అక్కడ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని గుర్తించారు. పర్యవేక్షించాల్సిన ప్రిన్సిపాల్ తీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై తీరు మార్చుకోవాలని ఫుడ్ విషయంలో ఎటువంటి పొరబాట్లు జరిగినా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లానని హెచ్చరించారు.

అన్యాయం జరిగిందంటూ ఏవోలు ఆరోపించడం తగదు

అమలాపురం రూరల్: పంచాయతీరాజ్ శాఖలో విప్లవాత్మకమైన సంస్కరణల్లో భాగంగా ఈవోపీఆర్డీలకు డిప్యూటీ ఎంపీడీవోలుగా హోదా కల్పిస్తూ ప్రభుత్వం జీవో నంబర్ 35 విడుదల చేయడంపై ఎంపీడీవోల పదోన్నతుల్లో ఏవోలకు 34 శాతం మాత్రమే అవకాశం కల్పించి అన్యాయం చేశారని ఏవోలు ఆరోపించడం తగదని పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్ఎస్ఎస్ సూరపరాజు తప్పుపట్టారు. తమకు 50 శాతం హోదా కల్పించాలంటూ వినతి పత్రాలు అందించడం మంచిది కాదన్నారు. జీవో 35పై కోనసీమ జిల్లా పంచాయతీ విస్తరణ అధికారుల సంఘం, పంచాయతీ కార్యదర్శుల సంఘం, మినిస్టీరియల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం వద్ద బుధవారం సమావేశం నిర్వహించి ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ జీవో వల్ల తమకు అన్యాయం జరిగిందంటూ ఏవోలు చేస్తున్న ఆరోపణలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తాము ఎన్నో పోరాటాలు చేసిన తరువాత జీవో నంబర్ 35 విడుదలైందని, దీనిని ఏవోలు వ్యతిరేకించడం సమంజసం కాదని సూరపరాజు హితవు పలికారు. ఈవోపీఆర్డీలు జి మల్లికార్జునరావు, యు.నాగేంద్ర, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.